
గోవిందరాజస్వామి ఆలయ గోపురం వద్ద..




చంద్రగ్రహణం వీక్షణ

ఆదివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా తిరుపతి నగరం ఇందిరా మైదానం వద్ద జన విజ్ఞాన వేదిక అధ్వర్యంలో టెలిస్కోప్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా నగరవాసులు చంద్రగ్రహణాన్ని ఆసక్తిగా వీక్షించారు.


గరుడ సర్కిల్ వద్ద..

శ్రీవారి ఆలయం మూత




నిర్మానుష్యంగా శ్రీవారి ఆలయ ప్రాంతం - మూసివేసిన మహాద్వారం తలుపుల ముందు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అధికారులు, అర్చకులు

చంద్రగ్రహణం: ఆదివారం రాత్రి 9.50 నుంచి సోమవారం వేకువజామున 1.31 గంటల వరకు
శ్రీవారి ఆలయం మూతపడింది: మధ్యాహ్నం 3.30 గంటలు
తిరిగి తెరచుకునేది: సోమవారం వేకువజాము 3 గంటలకు

ఆదివారం వేకువనుంచి మధ్యాహ్నం వరకు 27,525 మంది భక్తులకు శ్రీవారి దర్శనం చేయించి క్యూలైన్లను మూసివేశారు. ఏకాంత సేవ నిర్వహించి తలుపులు మూసివేశారు. వెంగమాంబ అన్నప్రసాద భవనం, లడ్డూ కౌంటర్లూ మూతపడ్డాయి. వీటిని సోమవారం ఉదయం నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు. అన్నప్రసాద కేంద్రాల మూత నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ముందుగానే 50 వేల పులిహోర ప్యాకెట్లను వితరణ చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


నిర్మానుష్యంగా అలిపిరి తనిఖీ కేంద్రం


ఆదివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం




మూత వేసిన పద్మావతి అమ్మవారి ఆలయం

అమ్మవారి ఆలయం..

తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయం మధ్యాహ్నం 2.15 గంటలకు మూతపడింది. అలాగే, తిరిగి టీటీడీ చెందిన సూర్యనారాయణస్వామి ఆలయం, శ్రీనివాస ఆలయం, ఉపాలయాల ద్వారాలను అధికారులు మూసివేశారు. సోమవారం ఉదయం తిరిగి ఆలయాన్ని తెరచి శుద్ధి, సంప్రోక్షణ తరువాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి


అమ్మవారి ఆలయాన్ని మూతవేస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

శ్రీకాళహస్తిలో గ్రహణ కాల అభిషేకం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం అర్ధరాత్రి గ్రహణ కాలం పురస్కరించుకుని మూలమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 9గంటల వరకు ఆలయాన్ని యథావిధిగా తెరచి ఉంచి భక్తులకు రోజులాగే దర్శనం కల్పించారు. గ్రహణ కాలం అర్ధరాత్రి వేళ కావడంతో ఆ సమయంలో అభిషేకాలను ఏకాంతంగా నిర్వహించారు. వారాంతపు సెలవులు కావడంతో కావడంతోపాటు చంద్రగ్రహణం రోజున ముక్కంటి ఆలయం మాత్రమే తెరవడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 25వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 76, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,817మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,425మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,461మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,250, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 440మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 375మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 141మంది పూజలుచేయించుకున్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి


దర్శనానికి వెళుతున్న భక్తులు

పీజీ అడ్మిషన్లకు ప్రభుత్వం పచ్చజెండా

- నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం
- 22 నుంచీ పీజీ ఫస్టియర్ తరగతులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీలు, కాలేజీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి అడ్మిషన్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆదివారం అడ్మిషన్ కమిటీ సమావేశమై నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మంగళవారం నుంచి 15వ తేదీ దాకా వెబ్ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. 9 నుంచీ 16 వ తేదీ దాకా వెరిఫికేషన్ కోసం సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి. 12 నుంచీ 17 వ తేదీ దాకా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. 18న వెబ్ ఆప్షన్లు మార్పు చేర్పులు చేసుకోవచ్చు. 20న సీట్లు కేటాయిస్తారు. 22 నుంచీ 24వ తేదీ దాకా సీటు వచ్చిన కాలేజీల్లో రిపోర్టు చేయాలి. అదే సమయంలో ఈనెల 22 నుంచే పీజీ ఫస్టియర్ క్లాసులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి షెడ్యూల్ విడుదల చేసింది.

ముగిసిన కంచి స్వాముల చాతుర్మాస దీక్ష

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి ద్వారకానగర్‌లోని కంచి కామకోటి మహాపాదుక మండపంలో పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి, సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి చేపట్టిన చాతుర్మాస దీక్ష ఆదివారం ముగిసింది. ఇక్కడి పీఠం మండపంలో జూన్ 7వ తేదీన కంచి స్వాములు చాతుర్మాస దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో భాగంగా పాదుక మండపంలో పలు పూజలు, వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. దీక్ష ముగింపు సందర్భంగా ఆదివారం పాదుక మండపం నుంచి నగరవనం వరకు విశ్వరూప యాత్ర నిర్వహించారు. నగరవనం చేరుకుని భగవద్గీత 11వ అధ్యాయంలోని విశ్వరూపయోగ పారాయణం చేశారు. అనంతరం ఊరేగింపుగా పాదుక మండపం చేరుకున్నారు. దర్శనానికి వచ్చిన భక్తులకు కంచి స్వాములు ఆశీర్వచనాలు అందించారు. మంగళవారం వరకు కంచి స్వాములు పాదుక మండపంలోనే ఉండి తర్వాత కంచి పీఠానికి వెళ్లనున్నారు. నాడు విజయేంద్ర సరస్వతి తొలి చతుర్మాస దీక్ష ఆంధ్రప్రదేశ్‌లో జరగ్గా.. ఇప్పుడు సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి తొలి దీక్ష కూడా రాష్ట్రంలోనే జరగడం గమనార్హం.


నగరవనంలోని ఉద్యానవనంలో కంచి స్వాములు

అధికారులూ ఇదేమి తీరు!

- నెర్రికాలువ గండికి అటువైపు కాంక్రీట్ వాల్ నిర్మాణం
- గండి పడిన చోట చెరువు మట్టితో పూడ్చడంపై రైతుల ఆగ్రహం


వాటంబేడు చెరువులో మట్టిని ఎక్స్‌కవేటర్ ద్వారా లారీకి నింపుతూ..


నెర్రికాలువ గండి పడిన చోట కాంక్రీట్ వాల్ నిర్మాణం లేకుండానే మట్టితో పూడ్చి చదును చేశారిలా..

సూళ్లూరుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం నెర్రికాలువ గండి పూడ్చివేత పనుల్లో ఇరిగేషన్ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. లూథరిన్ చర్చి వైపు హడావిడిగా కాంక్రీట్ వాల్ నిర్మించిన అధికారులు.. నెర్రికాలువకు గండిపడిన చోట మాత్రం చెరువు మట్టిని తోలి చదును చేస్తున్నారు. జీఎన్‌టీ రోడ్డులోని లూథరన్ చర్చి వెనుకాలే ఉన్న నెర్రికాలువకు గతేడాది డిసెంబరులో కురిసిన వర్షాలకు భారీగండి పడింది. జనవరిలో తాత్కాలిక మరమ్మతుల కింద ఇసుక బస్తాలు వేశారు. గండిపడిన చోట పూడ్చేందుకు శాశ్వత కాంక్రీట్ వాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.39 లక్షలు కేటాయించింది. కాలువకు గండిపడిన ప్రాంతంలో కాకుండా చర్చి వెనుకవైపు ఉన్న కట్టను తవ్వి అధికారుల సమక్షంలో కాంక్రీట్ వాల్ నిర్మాణం పూర్తి చేశారు. అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గండిపడిన చోట కూడా కాంక్రీట్ వాల్ నిర్మిస్తామని అధికారులు రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఇదే మాట ఎమ్మెల్యే విజయశ్రీకి కూడా చెప్పారు. కానీ, చర్చి వైపు కాంక్రీట్‌వాల్ నిర్మాణం పూర్తి చేశారు. తర్వాత సమీపంలోని వాటంబేడు చెరువు నుంచి మట్టి తోలి నెర్రికాలువ గండిని పూడ్చి కేవలం మట్టితోనే పొర్లుకట్టను చదునుచేస్తున్నారు. పక్కనే కాళంగి నది ఉండడంతో పొర్లుకట్ట ఏమాత్రం బలహీనమైన మళ్లీ గండిపడే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని తెలుసుకున్న రైతులు ఇదేమని ప్రశ్నిస్తే సమయం లేదు ప్రస్తుతం తాత్కాలికంగా గండిని పూడ్చి పొర్లుకట్టకు మట్టితో చదును చేసి సాగునీళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తప్పించుకున్నారు. నెర్రికాలువ గండిపూడ్చేందుకు మంజూరైన నిధులను ఇలా బూడిదలోపోసిన పన్నీరుగా అధికారులు దుర్వినియోగం చేశారని రైతులు ఆగ్రహిస్తున్నారు. అసలు పొర్లుకట్టకు రైతుల సాగునీటికి ఉపయోగపడే చెరువుల నుంచి మట్టిని తరలించకూడదు. కానీ చెరువు మట్టిని ఎక్స్‌కవేటర్లతో తవ్వి లారీలకు నింపి నిత్యం తరలిస్తున్నారు. దీని వెనుక అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల హస్తం కూడా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా అధికారులు విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మరింత మెరుగ్గా సచివాలయ వ్యవస్థ

- మూడంచెల పర్యవేక్షణకు కార్యాచరణ

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేసి మరింత మెరుగైన సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీటిపై పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థను తీసుకొచ్చింది. గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినా.. వాటిపై పర్యవేక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. జిల్లాలో 691 గ్రామ, వార్డు సచివాలయాల్లో 5225 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలు క్షేత్రస్థాయిలో సచివాలయాల నుంచే అందుతున్నాయి. ఇక్కడి ఉద్యోగులంతా ఇంచుమించుగా ఒకే కేడర్‌కు చెందినవారు కావడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. ఈ క్రమంలో వీటిపై పర్యవేక్షణకు జిల్లాలో డీఎల్డీవో, జేడీ స్థాయి అధికారిని గ్రామ, వార్డు సచివాలయాల అధికారిగా నియమిస్తారు. సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లను డిప్యుటేషన్‌పై నియమించనున్నారు. వీరితోపాటు ఇద్దరు సాంకేతిక సమన్వయకర్తలు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు ఉంటారు.



మండలస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ మండల అధికారి, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఉంటారు. వీరికి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నారు. గ్రేడ్-1, 2 పురపాలక సంఘాల్లో మేనేజరు, ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఉంటారు. నగర పంచాయతీల్లో ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను నియమించనున్నారు. ఇలా గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థ ఏర్పాటుకు గతవారం ఉత్తర్వులు వచ్చినట్లు జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ జగదీష్ చెప్పారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి
ప్రభుత్వం అడుగులు వేయాలి

- దసరా కానుకగా డీఏ మంజూరు చేయాలి
- ఏపీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్


మాట్లాడుతున్న ఏపీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

తిరుపతి(వైద్యం),సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): 'ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి. గత ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం చేయడంతో కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు ఆశలు పెట్టుకున్నారు.ప్రభుత్వానికి నిర్మాణాత్మక సహకారాన్ని అందిస్తున్నారు. అటువంటి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు దసరా కానుకగా డీఏ మంజూరు చేయాలి' అని ఏపీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. తిరుపతిలోని ఏపీఎన్జీవోస్ భవనంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలవుతున్నా ఉద్యోగులు తమ బకాయిల, ఇతర సమస్యల విషయంలో ఎలాంటి ఒత్తిడి చేయకుండా ఎదురు చూస్తున్నారన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు న్యాయం జరిగేలా తక్షణమే కొత్త కమిషన్ వేయాలన్నారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.30 కోట్ల వరకు ఉద్యోగుల బకాయిలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఫోరంను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల డిమాండ్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ వివరించారు. అనంతరం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి నేతలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లా అడహాక్ కమిటీ చైర్మన్‌గా సురేష్‌బాబు, కోకన్వీనర్‌గా రఘు, కోశాధికారిగా లలితకుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రావణ్‌కుమార్, సభ్యులుగా చెంచురత్నం, ఫణీంద్ర, జనార్ధనయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జగదీశ్వరరావు, ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, కడప, నెల్లూరు జిల్లాల అధ్యక్షులు శ్రీనివాసులు, పెంచల్‌రావు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, తిరుపతి తాలూకా అధ్యక్షుడు సురేష్‌బాబు, కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి పవిత్రోత్సవాలు



తిరుచానూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు ఆదివారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. సుప్రభాత సేవలో అమ్మవారిని మేల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి, శాంతి హోమం, కుంభప్రోక్షణ, నివేదన చేపట్టారు. ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు కేటీ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి, సుదర్శన చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహించారు. చక్రతళ్వార్‌ను పల్లకీపై ఊరేగింపుగా తీసుకెళ్లి పుష్కరిణాలో మూడు సార్లు మునక వేయించడంతో చక్రస్నానం ముగిసింది. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం దంపతులు, డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, శ్రీవాణి అర్చకులు శ్రీనివాసాచార్యులు, మణికంఠస్వామి, బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి సుబ్బరాయుడు, సుభాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.


పద్మసరోవరంలో చక్రత్తాళ్వార్‌ను మునక వేయిస్తున్న అర్చకులు


పరీక్షా కేంద్రం పరిశీలిస్తున్న డీఆర్వో నరసింహులు

ప్రశాంతంగా ఫారెస్టు బీట్ ఆఫీసర్ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫారెస్టు బీస్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు స్ర్కీనింగ్ పరీక్షలు జరిగాయి. ఉదయం సెషన్‌లో 10,493మంది అభ్యర్థులకుగాను 8,670మంది.. మధ్యాహ్నం సెషన్‌లో 1,690మందికిగాను 1,335మంది హాజరయ్యారు. పలు పరీక్షా కేంద్రాలను డీఈవో నరసింహులు పరిశీలించారు.

ముగ్గురు ఎంపీడీవోలకు పదోన్నతి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 46 మంది ఎంపీడీవోలకు పదోన్నతిని కల్పిస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు ఉన్నారు. వీరికి స్థానాలను కూడా కేటాయించారు. ఐరాల ఎంపీడీవో ధనలక్ష్మిని చిత్తూరు డ్వామా ఏపీవోగా, తిరుపతి ఎంపీడీవో కె.రామచంద్రను పలమనేరు డీడీవోగా, శ్రీకాళహస్తి ఈటీసీలో వెటర్నరీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అమర్నాథ్‌ను అక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రహణంతో ఆలయాల మూసివేత


మూతపడిన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం

చంద్రగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం కారణంగా మండలంలోని ఆలయాలు మూసివేశారు. శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. కల్యాణోత్సవం నిర్వహించి, మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయాన్ని మూసివేశారు. సోమవారం వేకువజామున మూడు గంటలకు తిరిగి ఆలయాన్ని తెరుస్తారు. తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యీశ్వరాలయం మధ్యాహ్నం 2 గంటలకు మూతబడింది. చంద్రగిరిలోని కోదండరామాలయం, శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయాలను కూడా మూసివేశారు. సోమవారం ఉదయం తెరవనున్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో గురుదేవోభవ

● ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక ప్రివిలేజ్ కార్డులు



ప్రివిలేజ్‌కార్డు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో కుమార్, సునందకుమార్‌రెడ్డి, శ్రీధర్‌ముని

తిరుచానూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి-రేణిగుంట రోడ్డులోని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో ఆదివారం ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యుల కోసం గురుదేవో భవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక ప్రివిలేజ్ కార్డులను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా డీఈవో కేవీఎన్‌కుమార్, ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాయలసీమ జోన్ అధ్యక్షుడు ఎన్.విశ్వనాథరెడ్డి, రవీంద్రభారతి స్కూల్ నిర్వాహకులు రవీంద్రారెడ్డి హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ విద్యావ్యవస్థ బలపడాలంటే ఉపాధ్యాయుల శ్రేయస్సు ముఖ్యమన్నారు. వారికోసం ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఆస్పత్రి సీఈవో శ్రీధర్‌ముని మాట్లాడుతూ సమాజానికి మార్గ దర్శకులైన ఉపాధ్యాయుల ఆరోగ్యం కాపాడటం తమ బాధ్యతన్నారు. ఇందులో భాగంగానే ప్రివిలేజ్ కార్డును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన గురువులే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అవుతారని తెలిపారు. అనంతరం 150మంది ఉపాధ్యాయులను ఆస్పత్రి వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఈవో హరికుమార్‌రెడ్డి, హెడ్ స్ట్రాటజీ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ప్రతిమ పాల్గొన్నారు.



అలరించిన నృత్య ప్రదర్శనలు

తిరుచానూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం కళాకారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లెకు చెందిన కళా తరంగిణి సంస్థకు చెందిన కళాకారులు లహరి, గగన, మేఘన, హేమావతి, యజ్ఞప్రసాద్, జస్మిత ప్రియ, నికిత, సాత్విక, బన్నీ, మోహిత్ తదితర కళాకారులు మహాగణపతి, వేయినామాలవాడ, హరహర శంభో శంకర వంటి భక్తిగీతాలు, వన్నెలాడి వయ్యారిదాన వంటి జానపద గీతం, చిన్ని చిన్న ఆశలున్న పరువానికి అనే సినీ గీతానికి నృత్యం చేశారు. వారికి శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ ప్రశంసాపత్రాలు అందజేసి, సత్కరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



క్యాలెండరును ఆవిష్కరిస్తున్న రత్నకుమార్, మురళీధర్

తిరుపతిరూరల్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలని ఐఎన్‌టీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎల్.రత్నకుమార్ కోరారు. ఎమ్మార్‌పల్లెలోని యూత్ హాస్టల్‌లో ఆదివారం సంఘ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 క్యాలెండరును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ, కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల, పోస్టల్ విభాగం, తిరుపతిలో ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్.మురళీధర్, ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, షఫీవుల్ల, మురళి, నాయకులు అనూష, శైలజ, షణ్ముగం, శేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

● తండ్రీకొడుకులకు గాయాలు


గాయపడిన తండ్రి, కొడుకు


రామచంద్రాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిళ్లవారిపల్లె పంచాయతీ పారకాల్వ గ్రామం వద్ద ఆదివారం ఉదయం బైక్, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో తండ్రీకొడుకులు గాయపడ్డారు. తిరుపతి కరకంబాడీకి చెందిన తండ్రీకొడుకులు వెంకటేష్, సంతోష్ కోళ్లు కొనడానికి వచ్చారు. పారకాలువ వద్ద ఆటో వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఇద్దరికీ గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. ఆర్సీ పురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సమాజ మార్గదర్శకుడు ఉపాధ్యాయుడే

● ఎమ్మెల్యేలు నాని, ఆరణి ● శిల్పారామంలో ఘనంగా గురుపూజోత్సవం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు నాని, ఆరణి తదితరులు

తిరుచానూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : సమాజానికి మార్గదర్శకుడు ఉపాధ్యాయుడేనని, వారిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆయన ఆధ్వర్యంలో తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని 1,500మంది ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. నాని మాట్లాడుతూ ఉపాధ్యాయులను సన్మానించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వైసీపీ పాలనలో గురువులను హింసించారని, జీతాలు కూడా సరిగా ఇవ్వకుండా ఇబ్బందిపెట్టారని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ ద్వారా వేలాది మందికి టీచర్ పోస్టులు ఇచ్చామని తెలిపారు. విద్యా వ్యవస్థ మెరుగునకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గురువుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. వారిని సన్మానించుకోవడం మన బాధ్యత అని అన్నారు. టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నరసింహయాదవ్, సుగుణమ్మ, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.


మూతపడ్డ కామాక్షి సమేత కోటిలింగేశ్వరాలయం

మూతబడ్డ ఆలయాలు

రామచంద్రాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా రాయలచెరువు కట్ట కామాక్షి సమేత కోటిలింగేశ్వరాలయాన్ని అర్చకులు ఆదివారం మధ్యాహ్నం 2.30గంటలకు మూసేశారు. సోమవారం ఉదయం 5గంటలకు ఆలయ సంప్రోక్షణ, శుద్ధి అనంతరం అభిషేకాలు నిర్వహించనున్నారు. శ్రీశక్తిపీఠంలోని మరకతశక్తి కాళీ అమ్మవారి ఆలయం, బ్రహర్షి పీఠంలోని లక్ష్మీనారాయణ ఆలయం, పానకాల్వ రాజరాజేశ్వరి ఆలయాన్ని మూసివేశారు.


కాళీ, కాలభైరవ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా కాళీ, కాలభైరవ కల్యాణం

రామచంద్రాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా శ్రీశక్తి పీఠంలో ఆదివారం కాళీ, కాలభైరవ హోమం నిర్వహించారు. మరకతశక్తి కాళీ అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 10 గంటలకు శక్తికాళీ, కాలభైరవ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి వేదికపైకి తీసుకువచ్చారు. వధువు, వరుడు తరపున వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామి అమ్మవార్లకు మంగళహారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.

పంటలపై ఆగని 'గజ' దాడులు


ఏనుగులు తొక్కేసిన వరిపంట - ధ్వంసమైన అరటి

కల్లూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. వరి, కొబ్బరి, మామిడి, టమోటా పంటలకు అపారనష్టం వాటిల్లుతోంది. దీంతో అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి బయల్దేరిన 14 ఏనుగుల గుంపు పాతపాళ్యం అడవి మార్గంలో సురేష్‌కు చెందిన పొలంలో చొరబడి మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. నటరాజ, ఈశ్వర్‌కు చెందిన పశుగ్రాసాన్ని తినేశాయి. అక్కడినుంచి పాతపేట వద్దకు చేరుకుని కుప్పయ్య, సుబ్రహ్మణ్యంకు చెందిన అరటిచెట్లు, పశుగ్రాసాన్ని తొక్కేసి, మామిడితోటకు అమర్చిన రాతికూసాలను విరిచేశాయి. కల్లూరులోని కోన్‌బాషాకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను, రాతికూసాలను ధ్వంసం చేశాయి. కల్లూరు నుంచి గంటావారిపల్లెకు వెళ్లే రోడ్డును దాటుకున్న ఏనుగులు తలారివారిపల్లె వద్దకు చేరుకున్నారు. కల్లూరులోని శేషాద్రి, కోదండయ్య, లక్ష్మీనారాయణ, మహబూబ్ బాషా, ఖాదర్ బాషాకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు రాతికూసాలను విరిచేశాయి. అటు నుంచి అటే అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగులు పెద్దవంక వద్దకు చేరుకున్నాయి. ఆదివారం పగలంతా పెద్దవంకలో తిష్ట వేసినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం ఉదయం సుమారు ఎనిమిది గంటల సమయంలో కల్లూరు నుంచి గంటావారిపల్లెకు వెళ్లే రోడ్డుకు సమీపంలో ఒంటరి ఏనుగు సంచరిస్తూ స్థానికుల కంటపడింది. యువకులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కేకలు పెట్టడంతో ఆ ఏనుగు అడవిలోకి వెళ్లిపోయింది.


కల్లూరు సమీపంలోని అడవిలో తిరుగుతున్న ఒంటరి ఏనుగు

పాపిరెడ్డిగారిపల్లె వద్ద ఒంటరి ఏనుగు

పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లె సమీపంలో రెండ్రోజులుగా పంటలను ఒంటరి ఏనుగు ధ్వంసం చేయడంతో అపారనష్టం జరుగుతోంది. తిరుపతి జిల్లాలోని కల్యాణి డ్యాం నుంచి రెండ్రోజుల కిందట పులిచెర్ల మండలం సరిహద్దులోని తూర్పు విభాగం అటవీ ప్రాంతం మూలమడుగు వద్దకు ఈ ఒంటరి ఏనుగు చేరుకుంది. శనివారం రాత్రి పాపిరెడ్డిగారిపల్లెలోని రైతులు మునిరాజ, నాగరాజు, చిరంజీవి, శ్రీధర్, రెడ్డెప్పకు చెందిన వరి, కొబ్బరి, వేరుశనగ, టమోటా, అరటి, మామిడిచెట్లను ధ్వంసం చేసింది.

రావణబ్రహ్మ వాహనంపై విఘ్ననాథుడి విహారం


రావణబ్రహ్మ వాహనంపై సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రతేక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం రావణబ్రహ్మ వాహనంపై సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు విహరించాడు. ఈ కార్యక్రమానికి పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కురప్పల్లె, సిద్ధంపల్లె, ముద్దురామాపురం గ్రామాలకు చెందిన గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులు ఉభయ వరుస తీసుకురావడంతో ఆలయ అలంకార మండపంలో ఉత్సవర్లకు పూజలు చేశాక రావణబ్రహ్మ వాహనంపై అధిష్ఠింపజేసి, కాణిపాక పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో పెంచలకిషోర్, ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీనాయుడు, ఉభయదారులు పాల్గొన్నారు. ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం వరసిద్ధుడికి యాళి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఒక్కొక్కటిగా.. నిండుతున్న కుప్పం చెరువులు


నిండుతున్న వీరప్పనాయని చెరువు

● వీరప్పనాయని చెరువుకు చేరుతున్న కృష్ణా జలాలు

కుప్పం నియోజకవర్గం ఆకుపచ్చగా మురిసిపోవడం ఇక ఎంతో దూరంలో లేదు. భూగర్భ జలాలు పన్నెండు వందల అడుగుల లోతు నుంచి పైపైకి ఎగిసి రావడానికి అట్టే సమయం పట్టదు. 733 కిలోమీటర్ల దూరం నుంచి తరలివస్తున్న కృష్ణమ్మ.. ఇక్కడి చెరువులను ఒక్కొక్కటిగా నింపుకుంటూ వెళుతుండటం వల్లే ఇవి సాధ్యం కాబోతున్నాయి.


నిండిన పరసముద్రం చెరువు

కుప్పం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువ ద్వారా నిండేలా నిర్దేశించిన చెరువుల్లో రెండోదైన వీరప్పనాయని చెరువుకు రెండ్రోజులుగా కృష్ణా జలాలు రావడం, నిండటం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గతనెల 30వ తేదీన కుప్పం పురపాలక సంఘం పరసముద్రం చెరువు వద్ద హంద్రీ-నీవా కాలువలో కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చి, ఇక్కడే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ఆయనలా అమరావతి బయల్దేరగానే విపక్ష వర్గాలు కాలువ ఎండిపోయిందంటూ అసత్య ప్రచారానికి తెరలేపాయి. వి.కోట సమీపంలో తాత్కాలిక సాంకేతిక పరమైన సమస్యతో ఆగిన పంపింగ్, అప్పటికప్పుడే తిరిగి ప్రారంభమై కృష్ణా జలాలు హంద్రీ-నీవా కాలువలో రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాల మీదుగా ఆఖరి మజిలీ అయిన పరసముద్రం చెరువులోకి దుమికాయి. ఈ చెరువు పూర్తిగా నిండి, ఈనెల 4న మొరవ కూడా పారింది. ఈ మొరవ ద్వారా పారుతున్న నీళ్లు, సప్లయ్ చానల్‌లో సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ప్రయాణించి కుప్పం పురపాలక సంఘం టూరిజం హోటల్‌ను ఆనుకుని ఉన్న వీరప్పనాయని చెరువుకు చేరుతున్నాయి. ఆదివారం సాయంత్రానికి సగానికిపైగా చెరువు నిండింది. ఇదే వేగంతో కృష్ణా జలాలు ప్రవహిస్తే మరో రెండు, మూడ్రోజుల్లో ఈ చెరువు పూర్తిగా నిండి, మొరవ పారి దిగువనున్న కుప్పం మండలం పెద్దబంగారునత్తం చెరువులోకి కృష్ణా జలాలు చేరే అవకాశం ఉంది. ఇలా.. దిగువన నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలోని చెరువులను నింపేదాకా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నమాట.

పటిష్ఠమవుతున్న చెరువు కట్టలు


వీరప్పనాయని చెరువు కట్టకు మరమ్మతులు - పటిష్ఠమైన పరసముద్రం చెరువు కట్ట

దాదాపు ముప్పయ్యేళ్లుగా కుప్పం నియోజకవర్గంలో కరువు విలయతాండవం చేస్తోంది. భారీ వర్షాలొస్తే తప్ప మిగిలిన రోజుల్లో నియోజకవర్గంలోని చెరువులు దాదాపు ఖాళీగానే ఉంటాయి. అందువల్ల ప్రభుత్వం కూడా చెరువుల పటిష్ఠత కోసం, కట్టల బలోపేతం కోసం తీసుకున్న చర్యలు అంతంత మాత్రంగానే ఉంటూ వచ్చాయి. ప్రస్తుతం కృష్ణా జలాలు తరలివస్తుండడంతో చెరువు కట్టలను పటిష్ఠం చేసే పనులు సూక్ష్మ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సాగుతున్నాయి. తొలుత పరసముద్రం చెరువు విషయంలో ఈ పనులు శరవేగంగా సాగాయి. ఇప్పుడిప్పుడే నిండుతున్న వీరప్పనాయని చెరువు కట్టను బలోపేతం చేసే పనులూ చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఈ చెరువు కట్టమీదుగానే పలమనేరు-కృష్ణగిరి బైపాస్ రోడ్డు సాగేది. పక్కనే ఫ్లైవోవర్ నిర్మించడంతో ఈ మార్గం మూసుకుపోయి, కోళ్ల వ్యర్థాలతోపాటు నానారకాల చెత్తాచెదారాలను వదిలించుకునే అనధికారిక డంపింగ్ యార్డుగా మారిపోయింది. ఇప్పుడు ఈ వ్యర్థాలను తొలగించడంతో పాటు చెరువు కట్టను చదును చేసే పనులు జరుగుతున్నాయి. ఇదేరీతిలో నియోజకవర్గంలోని అన్ని చెరువుల పటిష్ఠతకు చర్యలు తీసుకోవడానికి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

సమస్యలు లేకుండా జీవితం ఉండదు
నిమ్హాన్స్ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ శేఖర్


కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమస్యలు లేకుండా ఏ మనిషి జీవితమూ ఉండదని బెంగళూరులోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (నిమ్హాన్స్) మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ శేఖర్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో అధ్యాపకులకు చేపట్టిన మూడు రోజుల పునశ్చరణ తరగతుల్లో ఆదివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. సమస్యకు సరైన పరిష్కారాన్ని కనుక్కోవడమే మనిషి చేయాల్సిన పని అని స్పష్టం చేశారు. పద్మావతి వర్సిటీ వీసీ ఉమ మాట్లాడుతూ.. మారుతున్న కాలానుగుణంగా అధ్యాపకులు తమలోని అవగాహనకు మెరుగులు దిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పీఎం ఉష ప్రాజెక్టు డైరెక్టర్ ప్రొఫెసర్ వాణి మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు అధ్యాపకులకు అవసరమైన మెలకువలను తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆర్గనైజర్స్ ప్రొఫెసర్ జాన్ సుష్మా, డాక్టర్ భార్గవి, పలు విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి పనులు ఎప్పటికి పూర్తయ్యేనో!


పద్మావతి ఫ్లోర్ మిల్లు ఎదుట జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-రేణిగుంట మార్గంలోని పద్మావతి ఫ్లోర్ మిల్లు సమీపంలో గల 109 నెంబరు లెవల్ క్రాసింగ్ రైల్వే గేటు వద్ద జరుగుతున్న అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులు మంజూరైన రెండేళ్ల అనంతరం వివిధ అవాంతరాలను దాటుకుని పనులు ప్రారంభించారు. ఏడాది కాలంగా చేస్తూనే ఉన్నారు. ఈనెల 20వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉన్నా ఆ దిశగా పనులు కనిపించడం లేదు. రైల్వే గేటు తాత్కాలికంగా మూసివేయడంతో రాకపోకలకు ప్రజలకు ఇబ్బందిగా మారింది. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

వైభవంగా చండీహోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : పౌర్ణమిని పురస్కరించుకుని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. పండితులు రామకృష్ణశర్మ హోమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అవరణలో అమ్మవారి ఉత్సవమూర్తిని సింహ వాహనంపై అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. కలశస్థాపన చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అవాహనం చేసి హోమగుండం వెలిగించారు. తొలుత లక్ష్మీగణపతి పూజచేసి దుర్గాసప్తశతిలోని 13 అధ్యాయాలలో గల 700 మంత్రాలను పారాయణం చేస్తూ చండీహోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించి, అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హోమపూజలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని న్యూఇందిరా నగర్‌లో సాధన మహిళా అభ్యుదయ సేవా సంఘం, డీఎస్ఆర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు రాపూరు ప్రసాద్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలువురు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళా సంఘం అధ్యక్షురాలు సరళకుమారి, ఉపాధ్యక్షురాలు ఝాన్సీ కోశాధికారి శాలిని, నాయకులు ప్రభ పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు


పూజలు చేస్తున్న అర్చకుడు- పవిత్రమాలలను వేస్తున్న పండితులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం మూలవిరాట్‌లకు పవిత్ర మాలధారణ, విశేష పూజలు చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. యాగశాలలో ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో విశేష పూజాది కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం యాగశాల నుంచి పవిత్రమాలలు, పూజాద్రవ్యాలను ఈవో బాపిరెడ్డి, అధికారుల సారథ్యంలో ఊరేగింపుగా తీసుకెళ్లి మొదట రంగుల గోపురం వద్ద ఉన్న వినాయకస్వామికి సమర్పించారు. అనంతరం పరివార దేవతలందరికీ వాటితో అలంకరింపజేశారు. వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ మూలవిరాట్‌లకు పవిత్రమాలల సమర్పణ వేడుకగా నిర్వహించారు. యాగశాలలో శాంతిహోమం, చండికేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు. మాలధారణ జరిపి పవిత్రోత్సవాలను ముగించారు. ఈ సందర్భంగా ఈవో బాపిరెడ్డి మాట్లాడుతూ పవిత్రోత్సవాలు పౌర్ణమితో ముగిశాయన్నారు. నిత్యపూజల్లో ఏమైనా దోషాలుంటే ఈ పూజలతో తొలగిపోతాయని ఆయన వివరించారు.

సీఐలకు సన్మానం

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్న అలిపిరి, ఈస్ట్ సీఐలు రాంకిశోర్, శ్రీనివాసులును సుందరయ్యనగర్ యూత్ ఆదివారం సన్మానించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, సోము ఆధ్వర్యంలో వారు సీఐలను కలిసి సన్మానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

శెట్టిపల్లి భూసమస్య పరిష్కారంపై కృతజ్ఞతలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించడంపై రైతులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రైతుల అనుభవంలో ఉండి పెండింగ్‌లో ఉన్న 30 ఎకరాల ప్రొసీడింగ్స్ ఇప్పించాలని, ల్యాండ్ పూలింగ్‌కు పోను మిగిలిన భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇప్పించాలని కోరారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

టీటీడీ ఉద్యోగుల సమస్యలపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న గుణశేఖర్

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : టీటీడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం తప్పదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలోని పలవలి రామకృష్ణారెడ్డి హాలులో టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ 40వ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీటీడీ యాజమాన్యం విఫలమైందన్నారు. అధికారులు, పాలకమండలి మధ్య సమన్వయ లోపం దీనికి కారణంగా పేర్కొన్నారు. ఉద్యోగులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.వెంకటేశం, నాయకులు మల్లారపు నాగార్జున, ప్రధాన కార్యదర్శి కాటా గుణశేఖర్ మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవడానికి అనుమతి, పిల్‌గ్రిమ్, హిల్ అలవెన్స్ పెంపు, కారుణ్య నియామకాలు, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజ్, మినిమం టైంస్కేల్ వంటి అంశాలపై ఈ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కేఎస్ఎన్.ప్రసాద్‌రావు, టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాంపల్లిలో ఓ ఇంట్లో దొంగలు ప్రవేశించి 64 గ్రాముల బం గారు ఆభరణాలు దోచుకున్నారు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన ముప్పాల త్రి భువ నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లోని కుమార్తె ఇంటికివెళ్లింది. ఇదే అదనుగా శనివారం రాత్రి దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు తీసుకునిపోయారు. ఆదివారం స్వగ్రామానికి చేరుకున్న మహిళ చోరీ గుర్తించి శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. నెలరోజుల వ్యవధిలోనే ఈగ్రామంలో నాలుగు వరుస చోరీలు జరగడంతో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



తిరుమల శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి తాళాలతో ధ్వజస్తంభం వద్ద అర్చక బృందం - గోవిందరాజస్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో


మూతపడిన తిరుచానూరులోని సూర్యనారాయణస్వామి ఆలయం


ఇందిరా మైదానంలో చంద్ర గ్రహణాన్ని ఆసక్తిగా పరిశీలిస్తున్న నగరవాసులు


తాతయ్యగుంట గంగమ్మ ఆలయం

చంద్రగ్రహణంతో ఆలయాల మూత

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని ఆలయాలు చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం మూతవేశారు. గోవిందరాజస్వామి, కోదండరామస్వామి, కపిలేశ్వరస్వామి, తాతయ్యగుంట గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం మూసివేశారు. రాత్రి 9.50 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము 1.31 గంటల వరకు గ్రహణ ఘడియలు ఉంటాయి. ఉదయం ఆలయాలను తెరిచి శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.

అభివృద్ధి పథంలో గంగమ్మ ఆలయం

భూవిక్రయ యజమానులకు, దాతలకు కృతజ్ఞతలు - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


భూమి పత్రాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు అందిస్తున్న విక్రయదారులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : తాతయ్యగుంట గంగమ్మ ఆలయం అభివృద్ధి పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆలయాభివృద్ధిలో భాగంగా కొనుగోలు చేసిన ప్రైవేటు భూమి అగ్రిమెంటు ఆదివారం జరిగింది. భూ విక్రయదారుల నుంచి పత్రాలను స్వీకరించి ఈవో జయకుమార్‌కు అందించారు. భూ విక్రయదారులకు కొనుగోలు మొత్తంలో తొలి విడతగా రూ.25లక్షల చెక్కును అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతసంవత్సర కాలంగా ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమైనట్లు చెప్పారు. ఆలయానికి అనుకుని ఉన్న ముప్పయ్ ఒకటిన్నర అంకణాల ప్రైవేటు భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందుకుగాను దాతలు రాయలసీమ విద్యాసంస్థల అధినేత లావణ్య ఆనంద్‌రెడ్డి, కవిత, మనోహర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు తమవంతుగా ఐదులక్షల చొప్పున విరాళంగా అందించారని చెప్పారు. ఈ మొత్తాన్ని తొలి విడతగా భూ విక్రయ యజమానులకు అందించామన్నారు.మిగిలిన రూ.25లక్షలనుకూడా ఇవ్వడానికి దాతలు ముందుకొస్తున్నారని, త్వరలోనే ఆమొత్తం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుంటామని తెలిపారు. గంగమ్మ ఆలయాభివృద్ధికి టీటీడీ కూడా నిధులు వెచ్చించినట్లు చెప్పారు. అడిగిన వెంటనే భూమిని ఇవ్వడానికి అంగీకరించిన యజమానులకు, కొనుగోలు చేయడానికి విరాళాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, టీడీపీ నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, పులుగోరు మురళి, చింతా భరణి యాదవ్, దొడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, రాజారెడ్డి, గంజి సుధాకర్‌రెడ్డి, వెంకటేష్, పగడాల మురళి, ఆముదాల వెంకటేష్, ఆళ్వార్ మురళి, కోదండరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఉదయ్ ముదిరాజ్, జానకిరామ్‌రెడ్డి, బుజ్జిబాబు, రుద్రకిషోర్ పాల్గొన్నారు.

సమన్వయంతో భక్తులకు మెరుగైన సేవలు

● పోలీసు అధికారులకు ఎస్పీ హర్షవర్ధన రాజు సూచన



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించారు. తిరుపతిలోని పోలీసు అతిథిగృహంలో ఆదివారం ఆయన పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. గతేడాదిలాగే ఇప్పుడూ చిన్న సంఘటన కూడా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులందరూ కలిసి నిర్ణయం తీసుకుంటే ఎలాంటి సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందన్నారు. బాలాజీ నగర్‌తో పాటు పాపవినాశనం ఏరియా లలో నాకాబందీ నిర్వహించాలని సూచించారు. భక్తులతో ఏవిధంగా మెలగాలనే దానిపై ఆటో డ్రైవర్లు, జీపు డ్రైవర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలన్నారు. 400 మంది సిబ్బందితో క్రౌడ్ కంట్రోల్ ఎలా చేయాలనే దానిపై అవగాహన కార్యక్రమం చేపట్టాలని ఏఆర్ అదనపు ఎస్పీకి సూచించారు. మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడినప్పుడు తిరుమలలో ఏ రూట్‌లో వెళ్లాలనేది క్లియర్‌గా రూట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు, కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. తిరుమలలో ఇన్నర్.. ఔటర్ రింగ్‌రోడ్లలో డ్రోన్‌తో కవర్ చేయాలని ఆదేశించారు. తిరుపతి, తిరుమలలో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలని.. ఏ పార్కింగ్‌లో ఎన్ని వాహనాలు పడతాయనే దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడా బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెండు ఘాట్ రోడ్లలో తనిఖీ చేయాలని చెప్పారు. తిరుమలలో 10 చెక్‌పోస్టులు, ప్రతి సెక్టార్ సీసీ కెమెరాలతో పాటు ఈసారి సోలార్ సీసీ కెమెరాలనూ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రోప్ పార్టీలను సిద్ధంగా ఉంచాలని, తిరుమలలో చిన్నపిల్లలు తప్పిపోకుండా ఉండేందుకు ట్యాగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు కె.రవిమనోహరాచారి, శ్రీనివాసరావు, డీఎస్పీలు జె.వెంకటనారాయణ, భక్తవత్సలం, శ్యాంసుందర్, విజయశేఖర్, రామకృష్ణచారి, సీఐలు సాధిక్ అలీ, ఇంటెలిజెన్స్ టీటీడీ విజిలెన్సు అధికారులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, నాని, శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు - టేబుల్ టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

హోరాహోరీగా టేబుల్ టెన్నిస్ పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో బడి వరలక్ష్మి మెమోరియల్ మూడవ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు హాజరయ్యారు. కాసేపు క్రీడాకారులతో టేబుల్ టెన్నిస్ ఆడుతూ ఉత్సాహపరిచారు. వారు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బడి సుధాయాదవ్ రాజకీయాలతోపాటు క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ పోటీలకు అండర్ 11, 13, 15 విభాగాలలో బాలబాలికల 110 మంది ప్రాతినిధ్యం వహించారు. డీఎస్‌డీవో శశిధర్, రాజారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి : ఐదుగురిపై కేసు నమోదు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. సత్యవేడు ఆర్టీసీ డిపోకు చెందిన నెల్లూరు సర్వీసు బస్సు తిరుగు ప్రయాణంలో శనివారం రాత్రి సత్యవేడు వస్తోంది. రాచర్ల వద్ద ముందు వెళుతున్న ఆటోను బస్సు డ్రైవర్ నరసింహులు ఓవర్ టేక్ చేసి బస్టాప్‌లో ప్రయాణికులను దించారు. తమ ఆటోను ఎందుకు ఓవర్‌టేక్ చేశావంటూ ఆటోలో ఉన్న ఇద్దరు యువకులతో పాటు రాచర్లకు చెందిన మరో ఐదుగురు యువకులు డ్రైవర్‌పై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన కండక్టర్ గోపాల్‌పై కూడా దాడి చేశారు. గాయపడిన డ్రైవర్, కండక్టర్‌లను సత్యవేడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు రమేష్, మహేష్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రజల జీవన ప్రమాణాల పెంపునకే సూపర్ సిక్స్



సూపర్ సిక్స్ ర్యాలీలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నేతలు కొండేపాటి గంగాప్రసాద్, ఆకుతోట రమేష్, బొమ్మన్ శ్రీధర్ తదితరులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికే సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నేత కొండేపాటి గంగా ప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలో సూపర్ సిక్స్.. సూపర్ హిట్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఎమ్మెల్యే, కొండేపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్ ర్యాలీని ప్రారంభించారు. బాపూజీ వీధి మీదుగా వినాయకుడి గుడి సెంటర్, జీఎన్‌టీ రోడ్డు గుండా ఎస్‌కేఎస్ కల్యాణ మండపం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని చంద్రబాబు అన్ని విధాలా అభివృద్ధి చేస్తుంటే వైసీపీ అసత్య ప్రచారాలు చేయడం దుర్మార్గమన్నారు. సూపర్ సిక్స్ అమలులో భాగంగా తల్లికి వందనం, స్త్రీశక్తి, ఉచిత గ్యాస్ వంటి పథకాలతో గ్రామాల్లో ప్రజలు జీవన ప్రమాణాలు మెరుపడ్డాయన్నారు. ముందుగా ఆర్టీసీ బస్టాండు వద్దనున్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తానంకి నానాజీ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు నేరాలను విడిచిపెట్టి సత్ప్రవర్తనతో నడుచుకోవాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. ఆదివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రౌడీషీటర్లు గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామన్నారు. త్వరలో రానున్న అంజనేయస్వామి జెండా ఉత్సవాల్లో డీజేలకు అనుమతిలేదన్నారు. ఆంజనేయస్వామి జెండా, దసరా ఉత్సవాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాల్లో ఎక్కువ శబ్దాలతో వాయిద్యాలు ఏర్పాటు చేయకుండా, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. దసరా ఉత్సవాల్లో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రౌడీషీటర్లను బైండోవర్ చేసుకోవడం జరుగుతుందన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ శేఖర్ బాబు, ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

గూడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం కల్పించేది టీడీపీయేనని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బనిగీ సాహెబ్‌పేటలో బీసీ వసతిగృహ అదనపు గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతస్థాయికి ఎదిగేందుకు విద్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బీసీ విద్యార్థులు చదువుల్లో రాణించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బీసీల కోసం ప్రత్యేక వసతి గృహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు వసతులు కల్పించి చదువులు సాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, ధనుంజయరెడ్డి, జహంగీర్, అబ్దుల్ రహీం, ఇశ్రాయిల్‌కుమార్, అల్లీహుస్సేన్, నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బీసీ వసతి గృహ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

విధి నిర్వహణలో ఆటుపోట్లు సహజం



వెంకటరమణను సన్మానిస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

కోట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగ నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లు సహజమని, వాటిని ఎదుర్కొని నిలబడటమే ధృఢ సంకల్పమని సీఐ తురకా వెంకటరమణ(గబ్బర్‌సింగ్) అన్నారు. కోటలోని షాదీమందిర్‌లో ఆదివారం రాత్రి వెంకటరమణను పలు ప్రజాసంఘాల ప్రతినిధులు, యువకులు, పూలమాలలు, శాలువాలతో అభినందించారు. గతంలో కోట ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఆయన ఇటీవల సీఐగా పదోన్నతి పొందారు. ఆదివారం కోటకు వచ్చిన ఆయనను పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భారీ గజమాలలతో స్వాగతించారు. స్థాని ఆర్టీసీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి మోటారు బైక్‌లతో ర్యాలీగా షాదీ మందిర్‌కు చేరుకున్నారు. అక్కడ జరిగిన అభినందన సభలో పలువురు మాట్లాడుతూ వెంకటరమణ సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో ధైర్యం, నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచి చట్టానికి అందరూ సమానమే అన్న నినాదాన్ని జనంలోకి తీసుకెళ్లిన వ్యక్తి వెంకటరమణ అని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ప్రతినిధులు కర్లపూడి రాంబాబు, దిలీప్‌కుమార్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ రామకృష్ణరావు, మీజూరు మాధవ్, మల్లికార్జునరావు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

నాయుడుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట సుందరరామిరెడ్డి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన కోర్కెల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నభోజన కార్మికులు ఐక్యమత్యంగా ఉండి చట్టపరమైన పోరాటాలతో తమ కోర్కెలను సాధించుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఎస్‌కే వజీరియా, ఉపాధ్యక్షులుగా జయమ్మ, కళ్యాణి, కార్యదర్శిగా విజయమ్మ, కోశాధికారిగా రాణి, కార్యదర్శులుగా సుగుణమ్మ, లక్ష్మిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి శివకవి ముకుంద, నెలవల శ్యామలమ్మ, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత సుధాకర్‌రెడ్డి మృతి



సుధాకర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం ఎన్ఎం అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత చెన్నారెడ్డి సుధాకర్‌రెడ్డి(75) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయన హైదరబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం రాత్రి స్వగ్రామానికి తీసుకువచ్చారు. సోమ వారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుధాకర్‌రెడ్డి రెండు పర్యాయాలు టీడీపీ మండల అధ్యక్షుడుగా పనిచేశారు. అలాగే అక్కరపాక సర్పంచ్‌గా, సూళ్లూరు పేట ఏఎంసీ వైస్ ఛైర్మన్‌గా, నెలబల్లి సొసైటీ డైరెక్టర్‌గా, నెల్లూరు జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా పనిచేశారు.

డయాలసిస్ రోగికి ఆర్థిక సాయం

నాయుడుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటకు చెందిన పెరిచర్ల కిషోర్‌బాబు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. డయాలసిస్ చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో బలిజ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల అందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు శివప్రదీప్, కార్యదర్శి హంసాపృధ్వీ పాల్గొన్నారు.





ఎంపీడీవో కార్యాలయం, రామలింగేశ్వర ఆలయం వద్ద ఆక్రమణకు గురౌప కైవల్యా నది

కైవల్యా నదిని ఆక్రమించేస్తున్నారు..!

- బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులు
- రికార్డుల్లో వంక కాలువగా నమోదు
- కౌన్సిల్‌లో ప్రశ్నించినా పట్టించుకోని అధికారులు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మండలంలో కొండలు, గుట్టలు, కాలువలు, చెరువులతో పాటు చివరకు నదులనూ ఆక్రమించేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ప్రవహిస్తున్న కైవల్యా నది ఆక్రమణలకు గురౌతోంది. వర్షాకాలంలో కైవల్యా నదిలో 30అడుగుల వరకు వరదనీరు ఉప్పొంగుతుంది. నవంబరులో వెలిగొండల్లో నుంచి గొడ్డేరువాగు ద్వారా వర్షపు నీరు నదిలో కలుస్తుంది. దీంతో సమీపంలోని నివాస గృహాలకు ముంపు ప్రమాదం ఏర్పడుతూ ఉంటుంది. అయితే పట్టణంలో కైవల్యా నదికి ఇరువైపులా బఫర్ జోన్ ప్రాంతాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతి ఎలా ఇస్తారని పలుమార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారులను కౌన్సిలర్లు ప్రశ్నించి ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతి ఎలా ఇచ్చారని ఆరా తీయగా రెవెన్యూ రికార్డుల్లో కైవల్యా నదికి బదులుగా వంక కాలువగా మార్చేశారని తెలిసింది. 2015లో కైవల్యా నదికి వరదనీరు పోటెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇళ్లల్లోకి నీరు చేరడంతో అవస్థలు పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాశెంకోట సమీపంలోని గొడ్డేరువాగు తెగిపోయింది. అధికారులు పరిశీలించారే కానీ ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు. ఇవేవీ పట్టించుకోని అధికారులు కైవల్యానదిని వంక కాలువగా రికార్డుల్లో నమోదు చేసి నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తుండడం పట్ల కౌన్సిలర్లు ఆగ్రహం చేస్తున్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర ఘటోత్సవం



ఘటుం కుండలకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల



అమ్మవారికి బలి దున్నపోతును బహూకరిస్తున్న కేవీకే ప్రసాద్ నాయుడు, రాధిక దంపతులు

వెంకటగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) పట్టణంలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించే గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో కీలక ఘట్టమైన ఘటోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం 10గంటలకు కాంపాళెంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు దంపతులు అమ్మవారి బలి దున్నపోతుకు ప్రత్యేక పూజలు నిర్వహించి పనిబాటల వారికి అప్పగించారు. మధ్యాహ్నం సమయంలో అమ్మవారి అత్తవారిల్లుగా భావించే జీనిగులవారి వీధిలోని చాకలివారి ఆధ్వర్యంలో ఘటుం కుండలు కొలువుతీరాయి. సంప్రదాయం ప్రకారం బలిజ సామాజిక వర్గానికి చెందిన పత్తోళ్లు ఘటుం కుండలకు తొలిపూజ నిర్వహించారు. అమ్మవారి ఇష్టనైవేద్యమైన అంబలి, పొంగలిని ఘటుం కుండల ముందు ఉంచి పూజలు చేశారు. పత్తోళ్ల చేత తొలి టెంకాయ కొట్టి తెచ్చిన అంబలి, పొంగలిని ఘటుంకుండల్లో పోశారు. అనంతరం అమ్మవారి మండపం ముందు బలి దున్నపోతుకు స్నానం చేయించి పసుపు, కుంకుమలతో పూజలు చేసి పసుపుగుడ్డ కప్పారు. భక్తులు ఘటుం కుండలకు పూజలు చేసి తమవెంట తీసుకువచ్చిన అంబలి, పెరుగన్నం, పొంగలిని ఘటుంకుండల్లో వేసి మొక్కులు చెల్లించుకొన్నారు. భక్తుల పూజల అనంతరం ఘటుం కుండలను చాకలివారు నెత్తిన పెట్టుకొని ఆసాదుల తప్పెట్లు, యువత చిందులు, కేరింతల నడుమ బలి దున్నపోతును ఊరేగింపుగా తీసుకువెళ్లి పోలేరమ్మ దేవస్థానం వద్ద పూజలు చేశారు. తిరిగి ఘటుం కుండలు, బలి దున్నపోతును ఊరేగింపుగా తీసుకువెళ్లి అప్పటి రాజాల వంటశాల ప్రాంగణంలో వడ్లను పోసి వాటిపై కొలువుదీర్చారు. నగరి నుంచి వచ్చిన సారెలతో కుండలకు రాజాల అనుచరులు పూజలు నిర్వహించారు. అంబలి, పెనరుగన్నాన్ని ఘటుం కుండల్లో వేసి హారతి ఇచ్చారు. అక్కడ ఘటుం కుండలను భక్తులు దర్శించుకున్నాక పట్టణంలో తాటిపర్తి వారింటికి చేరుకోవడంతో చాకలివారి కాళ్లుకడిగి ఘటుంకుండలకు పూజలు చేశారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పోలేరమ్మ దేవస్థానం ఛైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, మంకు ఆనంద్, జీకేపల్లి బాబు నాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి తదితరులు ఘటుంకుండలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఘటోత్సవ కార్యక్రమంలో ఎటువంటి అవాంచనీయ్య సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.





కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ - బెస్త కార్పొరేషన్, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్లకు సత్కారం

టీడీపీలో కష్టపడే వారికి సముచిత స్థానం: కొండేపాటి

సూళ్లూరుపేట, తడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తారనడానికి నామినేటెడ్ పదవులు దక్కించుకున్న బొమ్మన్ శ్రీధర్, ఆకుతోట రమేష్‌లే ఉదాహరణని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌కేఎస్ కల్యాణ మండపంలో బెస్త కార్పొరేషన్, ఏఎంసీ చైర్మన్లుగా నియమితులైన బొమ్మన్ శ్రీధర్, ఆకుతోట రమేష్ అభినందన కార్యక్రమం టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొండేపాటి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని ముందకు తీసుకెళ్లాలన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ అధిష్టానం గుర్తింపు ఇస్తుందని, అంతేతప్ప పైరవీలకు తావుండదని చెప్పారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన భరించలేక ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని, అయినా ఆ పార్టీ నేతల్లో మార్పు రాలేదన్నారు. అబద్ధపు ప్రచారాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సార్వత్రిక ఎన్నికల వలే జైత్రయాత్ర కొనసాగించాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి చిరునామాగా మారిందని, త్వరలోనే పులికాట్ పూడిక తీత పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ టీడీపీలో గ్రూపులు లేవని, అందరూ ఒకే కుటుంబమని, కష్టపడ్డ వారికి పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని, అయన వైసీపీ నేతలు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బొమ్మన్ శ్రీధర్, ఆకుతోట రమేష్‌లను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్ కుమార్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, ఆప్కాబ్ చైర్మన్ పోలిశెట్టి, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, పెంచలకోన ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, నాగేశ్వరస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆదినారాయణరెడ్డి, టీడీపీ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, బొమ్మన్ పళణి, రఫీ, మాధవ నాయుడు, శెల్వం, ముప్పాళ్ల వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

వెంకటగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశీలించారు. ఆదివారం ఆయన పట్టణంలో అమ్మవారి అత్తవారి ఇల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలి మండపం వద్ద పోలేరమ్మ కొలువుదీరే ప్రదేశంలో క్యూలైన్లు ఏర్పాట్లు, అమ్మవారి పుట్టినిల్లుగా భావించే కుమ్మరివీధిలోని కుమ్మరి మండపం వద్ద క్యూలైన్లను పరిశీలించారు. అమ్మవారిని తీసుకువచ్చే సమయంలో తొక్కిసలాట జరగకుండా రోప్ పార్టీ ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. అదేవిదంగా అమ్మవారి దేవస్థానం వద్ద దర్శన క్యూలైన్లు ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. ఆయన వెంట దేవస్థానం చైర్మన్ గొల్లగుంగ మురళీ కృష్ణ, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరరావు, మంకు ఆనంద్ తదితరులు ఉన్నారు.

'రైతుపోరు' పోస్టర్ల ఆవిష్కరణ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతున్నలకు బాసటగా ఈనెల 9వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతుపోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మురళీధర్, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, సునీల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

గూడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు నిరసన తెలిపారు. అక్రమంగా సస్పెండ్ చేసిన కండక్టర్ శ్రావణ్‌కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆహ్మద్, వెంకయ్య, ప్రవీణ్, సంపత్, ప్రశాంత్, శ్రీనివాసులు, గౌస్, నారాయణ, సందానీ, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.





వరలక్ష్మిని సత్కరిస్తున్న మొదలియార్ సంఘ నాయకులు - కుంపటి కిషోర్‌ను సన్మానిస్తున్న చర్చి వ్యవస్థాపకురాలు వసంతకుమారి

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పెళ్లకూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామానికి చెందిన చిన్నంబేటి వరలక్ష్మి నాయుడుపేట మండలం విన్నమాల మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె గురుపూజోత్సవం నాడు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం వరలక్ష్మిని మొదలియార్ సంఘ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో మొదలియార్ సంఘం జిల్లా అధ్యక్షుడు కందమూడి పళని, కరీంబాయి, చెంచు సుబ్రహ్మణ్యం మొదలియార్, సాయిబాబా మొదలియార్, పలేంలటి రమణయ్య మొదలియార్, కూన మురళీ మొదలియార్, లొడారి మురళీ మొదలియార్, జయరాం మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: యాకశిరి పాటిమిట్టలో పనిచేస్తున్న కుంపటి కిషోర్ గురుపూజోత్సవం నాడు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం నాయుడుపేట మండలం విన్నమాలలోని జీసెస్ గ్రేస్ చర్చిలో కిషోర్ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. చర్చి వ్యవస్థాపకురాలు వసంతకుమారి, రాజరత్నం, పాస్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ విజయమేరీ, శేఖర్‌బాబు, ప్రసాద్, యేసుదాసు పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత



మూసివేసిన చెంగాళమ్మ ఆలయం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు ఆలయాలను మూసివేశారు. సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం 9 గంటలకు శుద్ధిపూజ సంప్రోక్షణ అనంతరం భక్తులకు పునఃదర్శన ప్రారంభిస్తామని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని మద్వేంకట రామ్మూరిస్వామి ఆలయం, ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, బాలాంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాలను కూడా మూసివేశారు.

గూడూరు: పట్టణంలోని కోదండ రామాంజనేయస్వామి, అళగనాధస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి మూసివేశారు. సోమవారం ఉదయం 7:30 నుంచి దర్శనం కల్పించనున్నారు.

చిల్లకూరు: తూర్పుకనుపూరు గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం, కలవకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను మధ్యాహ్నం 3గంటలకు మూసివేశారు. సోమవారం ఉదయం 7:30గంటలకు ఆయా ఆలయాల్లో దర్శనాలు ప్రారంభం కానున్నాయి.

కోట: గూడలిలోని సంఘమేశ్వరుడు, కామాక్షీదేవి, శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయం, గూడలితిప్పపై వెలసిన్న పర్వత వర్ధిని సమేత భీమేశ్వర ఆలయాలు మూతపడ్డాయి. అదే విధంగా కోటలోని గ్రామదేవత కోటమ్మ ఆలయం, వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయాలనూ మూసివేశారు.

వైభవంగా ఫలాభిషేకం



ఉత్సవ మూర్తులకు అభిషేకాల నిర్వహిస్తున్న అర్చకులు

చిట్టమూరు, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాం శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఫలాభిషేకం వైభవంగా జరిగింది. శతస్తంభాల కల్యాణ మండపంలో శ్రీవల్లీ, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామితో పాటు ఉత్సవమూర్తులకు 40 రకాల పండ్లు, తేనె, నెయ్యి, పంచదారతో ఆలయ ప్రధానార్చకులు మూలంరాజు భానుప్రకాష్‌శర్మ, వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేకాలు జరిపారు. నందిసేవ కార్యక్రమంలో భాగంగా రాత్రి మల్లాసుర, కొల్లాసుర, యుద్ధఘట్టాల సన్నివేశాలు భక్తులను ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ ఛైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సునీల్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చెర్మన్లు వెంకటసుబ్బారెడ్డి, సాయిరెడ్డి, చెంచురాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా ఆదివారం చెంగాళమ్మ ఆలయంలో మహా చండీయాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి వేదపండితులు, మంత్రోచ్చారణల నడుమ యాగం చేశారు. సూళ్లూరుపేటకు చెందిన భైరి పార్థసారధిరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. యాగం అనంతరం ఉభయకర్తలకు సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

హామీలను అమలు చేయండి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కడప జోన్ అధ్యక్షుడు ఎ.రాజు అన్నారు. నాయుడుపేట పట్టణంలోని శరవణ భవన్‌లో ఆదివారం జిల్లా కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా హరీష్, సెక్రటరీగా మహేష్, ట్రెజరర్‌గా సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్‌గా వివేకానంద, పబ్లిసిటీ సెక్రటరీ ప్రతాప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ భార్గవ్‌రెడ్డిలను ఎంపిక చేశారు. సమావేశంలో చంద్రశేఖర్, సుధాకర్, రాజేష్, మనదకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

వాకాడు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలో పట్టాభిరామాలయం కేంద్రంగా నడుపుతున్న సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వెంకటరమణారెడ్డి, సరోజనమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో పేద విద్యార్థులైన ఎంబేటి ధనుష్‌కుమార్, పలుపూరి లక్ష్మి గాయత్రిలకు నగదు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వాకామి హేమంత్ కుమార్, తేజోవతి, హరీష్‌రెడ్డి, శివకుమార్, మస్తానయ్య, వంశీ పాల్గొన్నారు.

బస్సును ఢీకొని ట్రాక్టర్ బోల్తా: ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం టపాయిండ్లు వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ప్రైవేట్ బస్సును ఢీ కొట్టి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కల్లూరు గ్రామానికి చెందిన సురేంద్ర, ట్రాక్టర్ డ్రైవర్ రమేష్ గాయపడ్డారు. ఆదివారం కల్లూరు నుంచి సూళ్లూరుపేటకు వెళుతున్న ట్రాక్టర్ లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో ముందు వెళ్తున్న ప్రైవేటు బస్సును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన సురేంద్ర, రమేష్‌ను హైవే అంబులెన్స్ సిబ్బంది సూళ్లూరుపేటకు తరలించి చికిత్స అందించారు.

నేటి నుంచి గిరిజనులకు ఆధార్ శిబిరాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజనుల కోసం ఈ నెల 8 నుంచి 13 వరకు ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆధార్‌లేని గిరిజనులు తమ సచివాలయ అధికారులను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్త ఆధార్‌కార్డుకు బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తారన్నారు. 8న మేలచ్చూరులో బీవీ పురం, బ్రాహ్మణపల్లి, మేలచ్చూరు,యార్లపూడి, కలవగుంట, మన్నవరం గ్రామాలకు, 9న ఎంపేడులో జగ్గరాజుపల్లి, ఇనగలూరు, పోలి, గోవిందరావుపల్లి, ఎంపేడు, పాతగుంట గ్రామాలకు, 10న వేలవేడులో గంగలపూడి, కుంటిపూడివ, వేలవేడు గ్రామాలకు ,11న ముచ్చివోలులో ఎర్రగుడిపాడు, ముచ్చివోలు, మంగళపురి,ఉడమలపాడు గ్రామాలకు, 12న ఎగువవీధిలో సుబ్బనాయుడుకండ్రిగ, కె.వెంకటాపురం, రామలింగాపురం, బొక్కసంపాళెం,ఎగువవీధి, తొండమనాడు, పుల్లారెడ్డికండ్రిగ గ్రామాలకు, 13న వేడాంలో వేడాం, రామాపురం గ్రామ గిరిజనులకు ఆధార్ నమోదు చేస్తారన్నారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్ వితరణ


ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

ఏర్పేడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్వీకండ్రిగ ప్రభుత్వ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి అవినాష్‌యాదవ్ రూ.17వేల విలువైన ఆర్వోప్లాంట్‌ను వితరణగా అందించారు. ఈయన సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. ఈ ఆర్వోప్లాంట్‌ను శనివారం రాత్రి పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఉపాధ్యాయులు ఆదివారం ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చలపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న బ్యాంకు సిబ్బంది

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఆదివారం వార్షికోత్సవం జరిగింది. కేక్ కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజరు నరసింహారెడ్డి మాట్లాడుతూ 120 సంవత్సరాలుగా తమ బ్యాంకు ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందిస్తోందన్నారు.

టీటీఈ సీఎస్‌వోపై అట్రాసిటీ కేసుకు డిమాండ్


భాగ్యానాయక్‌ను పరామర్శిస్తున్న నాయకులు

ఏర్పేడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వికృతమాల సమీపంలోని టీటీఈ కంపెనీ సీఎస్‌వో సూర్యారెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, యానాది సంఘం రాష్ట్ర కార్యదర్శి చందమాల కోటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న భాగ్యానాయక్‌ను వారు పరామర్శించారు. వారు మాట్లాడుతూ భాగ్యనాయక్ సెక్యూరిటీగా టీటీఈలో విధులు నిర్వహిస్తున్నాడన్నారు. రెండు రోజుల క్రితం అతనిని సూర్యారెడ్డి పిలిచి లాఠీతో కొట్టి కులం పేరుతో దూషించారన్నారు. ఐనా పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పందించి సూర్యారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రొడ్డగోపి, తమీన్, రాఘవులు, శేఖర్, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు. కాగా భాగ్యనాయక్ చేసిన ఫిర్యాదుపై విచారిస్తున్నామని సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఫిర్యాదుదారు ప్రవర్తనపై భిన్నమైన సమాచారం అందిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

గంగమ్మకు పొంగళ్లు సమర్పణ



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కంచనపుత్తూరులోని గంగమ్మకు గ్రామస్థులు ఆదివారం ఘనంగా పొంగళ్లు పెట్టారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహాన్ని పాలతో అభిషేకించారు. పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సిమెంట్ రోడ్డు నిర్మించినా తప్పని ప్రమాదాలు


ఇరువైపులా మట్టి వేయక ప్రమాదాలిలా..

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌పురం పంచాయతీ వేణుగోపాలపురంలో సిమెంట్ రోడ్డు వేసినా ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పల్లెపండగ కార్యక్రమంలో ఈఏడాది మార్చిలో రూ.8లక్షలతో సిమెంట్ రోడ్డు వేశారు. ఆరు నెలలు కావస్తున్నా రోడ్డుకు ఇరువైపుల మట్టి తోలకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మట్టి తోలాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

పుత్తూరు వార్తలు

భానుప్రకాష్‌ను సత్కరించిన కాలనీవాసులు



వడమాలపేట,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో సమస్యలు పరిష్కరించినందుకు లక్ష్మమ్మ కండ్రిగ ఎస్టీకాలని వాసులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. తీగునీటి సమస్య తీర్చారని, సిమెంట్ రోడ్డు వేశారని వారు పేర్కొన్నారు. ఆదివారం తిరుపతిలోని ఆయన నివాసానికి వారు వెళ్లారు. ఈ ఎస్టీకాలనీవాసులు ఆయనను పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ కష్టం వచ్చినా చెప్పితే తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు..

ప్రసన్న వెంకటేశ్వరుడి ఆలయ ద్వారం మూసివేత



వడమాలపేట,సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. మధ్యాహ్నం 1.50 గంటలకు ద్వారాలను మూసివేసినట్లు ఆలయ అధికారి వేనుగోపాల్ చెప్పారు. సోమవారం ఉదయం శుద్ధి, సంప్రోక్షణ, పుణ్యాహవచనం నిర్వహించి 6.15 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు చెప్పారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

వడమాలపేట,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరగనుంది. ఉదయం 10.00 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాలి. భానుప్రకాష్ పాల్గొంటారని మండల టీడీపీ అధ్యక్షుడు దాముయాదవ్ తెలిపారు. ప్రజలు హాజరై తమ గ్రామ, వ్యక్తిగత సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

పేదలకు అన్నదానం



రేణిగుంట సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం పేదలకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. మాజీ ఎంపీటీసీ శంకర్ జయంతి సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం వీఎస్ యూత్ ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌లు మునిర్, సూరిబాబు, ఎయిర్‌పోర్ట్ టాక్సీ అసోసియేషన్ ప్రెసిడెంట్ షఫీ, రైల్వేస్టేషన్ టాక్సీ స్టాండ్ సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సత్యవేడు మండల మీట్

సత్యవేడు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల మీట్ మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన జరగనుంది. ఇన్‌చార్జి ఎంపీడీవో త్రివిక్రమరావు ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. మండల మీట్‌కు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పకుండా హాజరుకావాలని కోరారు. మండల స్థాయి అధికారులందరూ ప్రగతి నివేదికలతో రావాలని ఆదేశించారు.

ఆలయ ద్వారం మూసివేత

నారాయణవనం,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధంగా ఉన్న కల్యాణ వెంకన్న ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం నేపధ్యంలో మధ్యాహ్నం 12 గంటలకు మూసి వేశారు. శుద్ధి, పుణ్యాహవచనం, సంప్రోక్షణ తరువాత సోమవారం ఉదయం 6 గంటలకు దర్శన ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయాధికారి నాగరాజు తెలిపారు.

ఏర్పేడు: మొదటిశివాలయంగా గుర్తింపు పొందిన గుడిమల్లం పరశురామేశ్వరాలయాన్ని ఆలయ అధికారులు చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం మూతవేశారు. గ్రహణం వీడిన తరువాత సోమవారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

పారిశుధ్య సమస్యను పరిష్కరించండి


స్తంభించిన మురుగునీరు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కాగితాల అరుందతివాడ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణ శివార్లలో 1వ వార్డు పరిధిలో ఈ దళితవాడ ఉంది. ఇక్కడ సుమారు 70కుటుంబాల ప్రజలు నివసిస్తున్నారు. కాలనీకి ఆనుకుని పూతలపట్టు-నాయుడుపేట ఆరులేన్ల జాతీయ రహదారిని నిర్మించారు. మురుగు వెళ్లే మార్గం లేక కాలనీలో ఇళ్ల మధ్యనే స్తంభించిపోతోంది. నెలల తరబడి మురుగు, వ్యర్థాలు నిల్వ చేరి పోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా దోమలు, దుర్గంధంతో తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బంగారు ఆభరణాల చోరీ


చిందర వందరగా పడి ఉన్న వస్తువులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాంపల్లిలో ఓ ఇంట్లో దొంగలు ప్రవేశించి 64 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకున్నారు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన ముప్పాల త్రిభువ నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లోని కుమార్తె ఇంటికివెళ్లింది. ఇదే అదనుగా శనివారం రాత్రి దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు తీసుకునిపోయారు. ఆదివారం స్వగ్రామానికి చేరుకున్న మహిళ చోరీ గుర్తించి శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. నెలరోజుల వ్యవధిలోనే ఈగ్రామంలో నాలుగు వరుస చోరీలు జరగడంతో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా ముగిసిన పవిత్రోత్సవాలు


పూజలు చేస్తున్న అర్చకుడు- పవిత్రమాలలను వేస్తున్న పండితులు- పూజా ద్రవ్యాలను తీసుకువస్తున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం మూలవిరాట్‌లకు పవిత్ర మాలధారణ, విశేష పూజలు చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. యాగశాలలో ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో విశేష పూజాది కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం యాగశాల నుంచి పవిత్ర మాలలు, పూజాద్రవ్యాలను ఈవో బాపిరెడ్డి, అధికారుల సారథ్యంలో ఊరేగింపుగా తీసుకెళ్లి మొదట రంగుల గోపురం వద్ద ఉన్న వినాయకస్వామికి సమర్పించారు. అనంతరం పరివార దేవతలందరికీ వాటితో అలంకరింపజేశారు. వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ మూలవిరాట్‌లకు పవిత్రమాలల సమర్పణ వేడుకగా నిర్వహించారు. యాగశాలలో శాంతిహోమం, చండికేశ్వరస్వామికి అభిషేకాలు చేశారు. మాలధారణ జరిపి పవిత్రోత్సవాలను ముగించారు. ఈ సందర్భంగా ఈవో బాపిరెడ్డి మాట్లాడతూ పవిత్రోత్సవాలు పౌర్ణమితో ముగిశాయన్నారు. నిత్యపూజల్లో ఏమైనా దోషాలుంటే ఈ పూజలతో తొలగిపోతాయని ఆయన వివరించారు..

కమ్మీలతో విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం


కమ్మీల మధ్య ఆడుకుంటున్న విద్యార్థులు

సత్యవేడు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుదుకుప్పం తమిళ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మాణాల కోసం తరలించిన ఇనుప కమ్మీలు విద్యార్థులకు ప్రమాదకరంగా మారాయని తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం కాంట్రాక్టర్ కమ్మీలను కొనుగోలు చేసి తీసుకొచ్చి మైదానం మధ్యలోనే ఉంచేశాడు. నెలల తరబడి అలాగే ఉండి పోయాయి. విద్యార్థులు ఆ కమ్మీల సమీపానే ఆటపాటలు కొనసాగిస్తు ప్రమాదంగా గడుపుతున్నారు. అధికారులు స్పందించి కమ్మీలను మరోచోటకు తరలించాల్సి ఉంది.

జగన్ జీవితం అబద్ధాలమయం : టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జగన్‌మోహన్‌రెడ్డి జీవితమంతా అబద్ధాలమయమని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంపూర్ణ మద్యనిషేధం అమలు చేస్తామని నాసిరకం మద్యంతో వేలకోట్లు దండుకున్నారన్నారు. 17 మెడికల్ కళాశాలలను తెస్తానని ప్రగల్భాలు పలికి. ఇపుడు సీఎం చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరంచేస్తున్నారని మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం ఖరారు చేసిన ఎలిజిబిలిటీ క్రైటీరియాను చదివి మాట్లాడితే బాగుటుందని హితవు పలికారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేస్తూ మరో పది మెడికల్ కళాశాలలను చంద్రబాబు కట్టిస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు భీమాల భాస్కర్ ముదిరాజ్, మునిరాజా యాదవ్, వజ్రం కిషోర్, గాజుల భగత్, మణి, మురళీకృష్ణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బకాసుర వధ


ద్రౌపదీదేవి అమ్మవారి ఊరేగింపు

పిచ్చాటూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ధర్మరాజు తిరుణాళ్ళలో భాగంగా ఆదివారం బకాసుర వధ ఘట్టం అలరించింది. బకాసుర వేషధారి కలయ తిరుగుతూ చక్కని హావభావాలతో ఆకట్టుకున్నారు. సాయంత్రం ద్రౌపదీ అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఘనంగా ఊరేగింపు సాగింది. భక్తులు ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. హారతులతో నీరాజనాలు పలికారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి: ఐదుగురిపై కేసు నమోదు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌లపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు సత్యవేడు ఆర్టీసీ డిపోకు చెందిన నెల్లూరు సర్వీసు బస్సు తిరుగు ప్రయాణంలో శనివారం రాత్రి సత్యవేడు వస్తోంది. రాచర్ల వద్ద ముందు వెళుతున్న ఆటోను బస్సు డ్రైవర్ నరసింహులు ఓవర్ టేక్ చేసి బస్టాప్‌లో ప్రయాణికులను దించారు. తమ ఆటోను ఎందుకు ఓవర్ టేక్ చేశావంటూ ఆటోలో ఉన్న ఇద్దరు యువకులతో పాటు రాచర్లకు చెందిన మరో ఐదుగురు యువకులు డ్రైవర్‌పై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన కండక్టర్ గోపాల్‌పై కూడా దాడి చేశారు. గాయపడిన డ్రైవర్, కండక్టర్‌లను సత్యవేడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు రమేష్, మహేష్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హోరాహోరీగా టేబుల్ టెన్నిస్ పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో బడి వరలక్ష్మి మెమోరియల్ మూడవ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు హాజరయ్యారు. కాసేపు క్రీడాకారులతో టేబుల్ టెన్నిస్ ఆడుతూ ఉత్సాహపరిచారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బడి సుధాయాదవ్ రాజకీయాలతోపాటు క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. కాగా ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా అండర్ 11, 13, 15 విభాగాలలో బాలబాలికల 110 మంది ప్రాతినిధ్యం వహించారు. డీఎస్‌డీవో శశిధర్, రాజారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కోసం ప్రివిలేజ్ ఆరోగ్య కార్డులు



ప్రివిలేజ్ కార్డు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో కుమార్, సునందకుమార్‌రెడ్డి, శ్రీధర్‌ముని

తిరుచానూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి-రేణిగుంట రోడ్డులోని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో ఆదివారం ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యుల కోసం గురుదేవోభవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్యేక ప్రివిలేజ్ కార్డులను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా డీఈవో కేవీఎన్‌కుమార్, ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాయలసీమ జోన్ అధ్యక్షుడు ఎన్.విశ్వనాథరెడ్డి, రవీంద్రభారతి స్కూల్ నిర్వాహకులు రవీంద్రారెడ్డి హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఆస్పత్రి సీఈవో శ్రీధర్ ముని మాట్లాడుతూ ఉపాధ్యాయుల కోసం ప్రివిలేజ్ కార్డును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన గురువులే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అవుతారన్నారు. 150మంది ఉపాధ్యాయులను ఆస్పత్రి యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో సీఈవో హరికుమార్‌రెడ్డి, హెడ్ స్ట్రాటజీ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ప్రతిమ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక


మాజీ వైస్ ఎంపీపీపద్మనాభం సమక్షంలో చేరిన దృశ్యం

పిచ్చాటూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం కీళపూడి పంచాయతీకి చెందిన సుమారు 300 మంది మాజీ వైస్ ఎంపీపీ, బీజేపీ సీనియర్ నేత పాల పద్మనాభం సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరారు. ఖుత్యాలమ్మ ఆలయం వద్ద ఈ సందర్భంగా పద్మనాభం మాట్లాడుతూ అన్ని సామాజికవర్గాల వారు బీజేపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలోచేరిన వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆకర్షితులై భారతీయ జనతా పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. బీజేపీ సీనియర్ నేతలు పాల పద్మనాభం, గజేంద్రలు పార్టీలో చేరిన వారికి సభ్యత్వ రసీదును అందించారు.

పరశురామేశ్వరుడి సేవలో అదనపు జిల్లా న్యాయమూర్తి


ఆలయం వద్ద జడ్జి గాయత్రిదేవి

ఏర్పేడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని విశాఖపట్నం జిల్లా అదనపు జిల్లా న్యాయమూర్తి సీకే గాయత్రి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ గిరినాయుడు పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : పౌర్ణమిని పురస్కరించుకుని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. పండితులు రామకృష్ణశర్మ హోమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అవరణలో అమ్మవారి ఉత్సవమూర్తిని సింహ వాహనంపై అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. కలశస్థాపన చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ఆవాహనం చేసి హోమగుండం వెలిగించారు. తొలుత లక్ష్మీగణపతి పూజచేసి దుర్గాసప్తశతిలోని 13 అధ్యాయాలలో గల 700 మంత్రాలను పారాయణం చేస్తూ చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు.